# పిప్పలి

ఇది మిరియాలు మరియు తమలపాకు కుటుంబానికి చెందిన భూమిపై ప్రాకే బహువార్షికపు తీగ. దీని పండ్ల కంకులను పిప్పళ్ళు అని మరియు వేర్లను పిప్పలిమోడి అని పిలుస్తారు. వీటిని ఎక్కువగా శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నివారణకు మరియు జీర్ణశక్తికి వాడుతారు. ఆయుర్వేదంలో వేరును కడుపులో గ్యాస్ తగ్గించడానికి, లివర్ టానిక్‌గాను ఉపయోగిస్తారు. ఫలాలను మూత్రం సులువుగా జారీ చేయుటకు మరియు కీళ్ళనొప్పులకు వాడుతారు.

**వాతావరణం :** పాక్షికంగా నీడ ఉండాలి. కొండ ప్రాంతాల్లో ఎక్కువగా కనపడుతుంది. కొబ్బరి, పోక మరియు ఇతర నీడనిచ్చే చెట్లకు పాకించవచ్చు. అంతర పంటగా సాగుచేయవచ్చు.

**నేలలు :** నీరు నిలువ ఉండకూడదు. తేమ గల భూములు ముఖ్యంగా ఎర్రని మరియు నల్లని నేలలు బాగా అనుకూలం. భూమిలో సేంద్రియ పదార్థం అధికంగా ఉంటే బాగా పెరుగుతుంది.

**ప్రవర్ధనం :** సాధారణంగా కొమ్మ కత్తిరింపుల ద్వారా వ్యాప్తి చేస్తారు. షుమారు 5 కణుపులున్న ముక్కలను పాలిథిన్ సంచుల్లో నాటుకుని వేర్లు తొడిగిన తరువాత (వీలైనంత వరకు వర్షాకాలంలో) పొలంలో నాటుకోవాలి.

**నాటటం :** ఎకరానికి షుమారు 11,000 మొక్కలు (60×60 సెం.మీ.) అవసరం అవుతాయి (ఏకపంటగా). మే-జూన్ నెలల్లో నాటుకుని నీరివ్వాలి. ఏక పంటగా సాగుచేస్తే త్వరగా పెరిగి నీడనిచ్చే చెట్లను 4-5 నెలలు ముందుగా నాటితే మంచిది. వీటి ద్వారా నీడ మరియు ఆధారం దొరుకుతుంది.

**నీటి యాజమాన్యం :** తొలిరోజుల్లో వారానికొకసారి (వర్షం లేకపోతే) నీరివ్వాలి. బాగా ఎదిగిన తరువాత 10 రోజులకొకసారి నీరిస్తే సరిపోతుంది. వీలుంటే స్ప్రింక్లర్ కూడా వాడుకోవచ్చు.

**సస్యరక్షణ :** ఈ పంటనాశించే చీడపీడల నివారణకు క్రింది విధంగా చర్యలు చేపట్టాలి.

1. కీటకాలు ఆశించినపుడు 0.3 శాతం వేప గింజల మరియు బెరడు కషాయం పిచికారి చేయాలి.
2. ఆకులకు మచ్చలాంటి తెగులు సోకినపుడు 1 శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారి చేయాలి.

**పంటసేకరణ :** నాటిన 6-7 నెలలకు కాయలు కోయవచ్చు. కాయలు కాసిన 2-3 నెలలకు కోత తీసుకోవచ్చు. సాధారణంగా జూన్‌లో నాటిన యెడల జనవరి-ఫిబ్రవరికి తయారవుతాయి. కోసిన కాయలు 4-5 రోజులు ఎండబెట్టి భద్రపరచుకోవాలి.

**దిగుబడి :** మొదటి సంవత్సరం 100-150 కి॥, రెండవ సంవత్సరం 200-250 కిలోలు, మూడవ సంవత్సరం మరియు నాల్గవ సంవత్సరం షుమారు 300-350 కి॥ దిగుబడి వస్తుంది. ఒకసారి నాటితే 3-4 సం॥ల వరకు కోత తీసుకొని తరువాత పీకివేసి కొత్తగా నాటుకోవాలి. ఇలా చేయగా వచ్చిన వేర్లను పిప్పలిమోడిగా మరియు కొమ్మలను ప్రవర్ధనం కొరకు వాడుకోవచ్చు.

**ఆదాయ వ్యయాలు :** మొదటి సంత్సరం రూ. 5,000-10,000 ఖర్చు మరియు రూ. 10,000 నికరాదాయం లభిస్తుంది. రెండవ సంవత్సరం నుండి ఎకరానికి రూ. 3,000-5,000 ఖర్చు మరియు రూ. 15,000-20,000 వరకు ఆదాయం లభిస్తుంది. నాల్గవ సంవత్సరంలో కాయలతోపాటు వేర్ల నుండి కూడా అదనపు ఆదాయం లభిస్తుంది.

ు.